సాక్షి
పార్వతీపురం మన్యం

మంగళవారం । 31 । అక్టోబర్ । 2023



సిరిమానోత్సవానికి సర్వం సిద్ధం

భక్త కోటికి ముక్తిదాయకం సిరిమాను వీక్షణం. ఆ చల్లని తల్లి కరుణా కటాక్షాలకోసం లక్షలాది మంది భక్తులు సిరిమానును దర్శించుకునేందుకు తరలివస్తారు. - IIలో



గొట్లాంను దత్తత తీసుకున్న మెడికల్ విద్యార్థులు

గొట్లాం, రెడ్డిపేట, బారికపాలెం, జియ్యన్నవలస గ్రామాలను మెడికల్ యూనివర్సిటీ విద్యార్థులు దత్తత తీసుకున్నారు. - IIలో



జిల్లాస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం

గజపతినగరంలోని బాలికోన్నత పాఠశాల ప్రాంగణంలో జిల్లాస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభమయ్యాయి. - IIలో

న్యూస్‌రీల్

ప్రజలకు ఆరోగ్య రక్ష

- జిల్లా వ్యాప్తంగా జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు
- జిల్లాలో 2,897 మందికి ఓపీలు

పార్వతీపురంటౌన్: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలు ప్రజలకు ఆరోగ్య భరోసా కల్పిస్తున్నాయని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి డాక్టర్ బి.జగన్నాథరావు అన్నారు. శిబిరాలకు వచ్చేవారికి వైద్య నిపుణులు వైద్యపరీక్షలు చేస్తున్నారని, ప్రాథమిక దశలోనే వ్యాధులను గుర్తించి అవసరమైన మందులు అందజేస్తున్నారన్నారు. శిబిరాలను జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జిల్లాలో సోమవారం జేఏఎస్ శిబిరాల్లో అందించిన సేవలు ఇలా...

మండలాలు	15
వైద్యశిబిరాలు	6
మొత్తం ఓపీలు	2,897
స్పెషలిస్టు ఓపీలు	1,041
పీహెచ్‌సీ సిబ్బంది	
నిర్వహించిన ఓపీలు	1,757
డీఎం	153
హెచ్‌టీఎన్	353
ఏఎన్‌సీ	51
పీఎన్‌సీ	31
అనీమియా	78
ల్యాబ్‌టెస్టులు	1,844
ఈసీజీ పరీక్షలు	89
రిఫరల్ కేసులు	69

నేడు జిల్లాలో 7 వైద్య శిబిరాలు

పీహెచ్‌సీ	శిబిరం నిర్వహించే ప్రదేశం
తాడికొండ	ఎల్విన్‌పేట సచివాలయం
మాదలంగి	కురుపాం-2 జెడ్పీహెచ్ఎస్
దోకిశీల	ములగ జెడ్పీహెచ్ఎస్
బూసాయవలస	శివరాంపురం సచివాలయం
కుసిమి	సంగాం జెడ్పీహెచ్ఎస్
సీతానగరం	తామరఖండి ఎంపీపీ స్కూల్
రావివలస	కుదమ విలేజ్ క్లినిక్

తివ్వాకొండల్లో ఏనుగుల గుంపు



ఇసుకగూడ సమీపంలో ఏనుగుల గుంపు

భామిని: మండలంలోని తివ్వాకొండ పరిసరాల్లో ఏనుగుల గుంపు సంచరిస్తోంది. ఇసుకగూడ, సన్నాయిగూడ, డాబాగూడ సమీపాల్లోని పంట పొలాల్లోకి సోమవారం చేరాయి. కొండ ఆవల తాగునీరు లేకపోవడంతో మళ్లీ పొలాల్లోకి వచ్చినట్టు గిరిజన రైతులు చెబుతున్నారు.

1500 క్యూసెక్కుల నీరు విడుదల



నీటిని కిందకు విడిచిపెడుతున్న దృశ్యం

వంగర: మడ్డువలస గొర్లె శ్రీరాములునాయుడు ప్రాజెక్టు నుంచి ఒక గేటు ఎత్తి 1500 క్యూసెక్కుల నీటిని కిందకు విడిచిపెడుతున్నట్టు ఏఈ నితిన్ సోమవారం తెలిపారు. ప్రస్తుతం ప్రాజెక్టు వద్ద 63.84 మీటర్ల నీటి మట్టం ఉండగా సువర్ణముఖి, వేగావతి నదుల నుంచి వెయ్యి క్యూసెక్కుల ఇన్‌ఫ్లో ప్రాజెక్టులోకి వచ్చి చేరుతోందన్నారు.

ఆపన్నహస్తం

- రైల్వే ప్రమాద బాధితులకు అండగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు
- క్షతగాత్రులను పరామర్శించిన సీఎం వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి
- మృతుల కుటుంబాలకు ఓదార్పు
- సహాయక చర్యలు ముమ్మరం
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన డిప్యూటీ సీఎం బూడి, ఎమ్మెల్యే కడుబండి
- రైల్వే సిబ్బంది శ్రమతో 20 గంటల తర్వాత ట్రాక్ పునరుద్ధరణ
- మృతులు 13 మందిలో 12 మందిని గుర్తించిన అధికారులు
- ఆదుకున్న శిరికిపాలెం గ్రామస్తులు
- సేవల్లో పలు బృందాలు

జామి/లక్కవరపుకోట/శృంగవరపుకోట: విజయనగరం జిల్లా అలమండ రైల్వేస్టేషన్ సమీపంలో కంటకాపల్లి వద్ద ఆదివారం రాత్రి రెండు పాసింజర్ రైళ్లు ఢీకొన్న విషయం తెలిసిందే. విశాఖపట్నం నుంచి బయల్దేరిన విశాఖ-పలాస పాసింజర్ రైలును అదే మార్గంలో కొద్ది నిమిషాల వ్యవధిలో బయల్దేరిన విశాఖ-రాయగడ పాసింజర్ రైలు వెనుకనుంచి ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో 13 మంది మృతిచెందగా, పదుల సంఖ్యలో క్షతగాత్రుల య్యారు. ఘటనపై స్పందించిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సహాయక చర్యలతో పాటు క్షతగాత్రులు, మృతుల కుటుంబాలకు ఆపన్నహస్తం అందిస్తున్నాయి. ఓ వైపు రైల్వే ట్రాక్ పునరుద్ధరణ పనులు యుద్ధప్రాతిపదికన పూర్తిచేస్తూనూ... క్షతగాత్రులకు మెరుగైన వైద్యసేవలు అందించడంపై ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నాయి. విజయనగరం సర్వజన ఆస్పత్రికి ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి హుటాహుటిన చేరుకుని క్షతగాత్రులను సోమవారం పరామర్శించారు. ఆరోగ్యంపై ఆరా తీశారు. కోలుకునేవరకు మెరుగైన వైద్యం అందిస్తామని భరోసా ఇచ్చారు.



క్షతగాత్రులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని విజయనగరం సర్వజన్న ఆస్పత్రి వైద్యులకు సూచిస్తున్న ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్‌మోహన్‌రెడ్డి

రైల్వే ట్రాక్ పునరుద్ధరణ

భీమాళి-అలమండ రైల్వేస్టేషన్ల మధ్య జరిగిన రైలు ప్రమాదంలో మూడు రైల్వే ట్రాక్‌లు దెబ్బతిన్నాయి. భారీ క్రేన్‌లు, ఏఆర్‌టీ, ఎంఆర్‌పీ వంటి యూనిట్‌లను తీసుకొచ్చి 20 గంటల్లో అప్-డౌన్ ట్రాక్‌లను రైల్వే సిబ్బంది పునరుద్ధరించారు. రైల్వే జీఎం మనోజ్‌శర్మ, డీఆర్‌ఎం సౌరవ్‌ప్రసాద్ పనులను పర్యవేక్షించారు. గూడ్స్, డొమెస్టిక్ ట్రైన్‌ల రాకపోకలు పునరుద్ధరించారు. సహాయక చర్యల్లో ఎస్‌డీఆర్ఎఫ్, ఎన్‌డీఆర్ఎఫ్, ఆర్‌పీఎఫ్, ఓడీఆర్ఎఫ్, జీఆర్‌పీ, ఏపీ పోలీస్, ఏపీ ఫైర్, ఆరోగ్యశాఖ బృందాలు తమ సేవలు అందించాయి. ప్రత్యేక బృంధాలు ప్రమాద కారణాలను అన్వేషించి, సాక్ష్యాలు సేకరించే పనిలో ఉన్నాయి.

ఆదుకున్న 'శిరికిపాలెం'

ప్రమాదవార్త తెలిసిన వెంటనే గంట వ్యవధిలో శిరికిపాలెం గ్రామస్తులు స్పందించారు. సెల్‌ఫోన్లు, టార్చ్‌లైట్ల వెలుగులో క్షతగాత్రుల తరలింపు, చనిపోయిన వారి మృతదేహాలను వెలికి తీయడంలో వైద్య, పోలీస్ బృందాలకు సహకరించారు. సోమవారం ఉదయం నుంచి ఘటనాస్థలి వద్దనే పొయ్యిలు ఏర్పాటు చేసి సహాయకులకు వంటలు చేసి వడ్డిస్తున్నారు. అలాగే ఏపీ, తెలంగాణ రాష్ట్రాల్లోని టెలికామ్ సంస్థ ఎండీ రామ్మోహనరావు, ఇండస్ టవర్ విశాఖపట్నం రీజినల్ ఏఓ ఎం.సీతారాం తమ సిబ్బందితో వచ్చి సహాయక చర్యల్లో పాల్గొన్నవారికి రూ.30వేలు విలువైన ఎనర్జీ డ్రింక్స్, బిస్కెట్లు అందజేశారు.



సేవాబృందాలకు తాగునీరు అందజేస్తున్న శిరికిపాలెం వాసులు



అల్పాహారం వడ్డిస్తున్న శిరికిపాలెం యువత

కూలి బతుకుల్లో విషాదం



రెడ్డి సీతంనాయుడు(ఫైల్)



కె.అప్పలనాయుడు(ఫైల్)



పిల్లా నాగరాజు (ఫైల్)



మజ్జి రాము(ఫైల్)

చీపురుపల్లి రూరల్(గరివిడి): భవన నిర్మాణపనికి వెళ్లి తిరిగివస్తున్నవారిని రైలు ప్రమాదం రూపంలో మృత్యువు కాటేసింది. కూలి కుటుంబాల్లో విషాదం నింపింది. రైలు ప్రమాదంలో భవన నిర్మాణ కార్మికులైన చీపురుపల్లి పట్టణంలోని రెడ్డిపేటకు చెందిన రెడ్డి సీతంనాయుడు, గరివిడి మండలం గదబవలస గ్రామానికి చెందిన మజ్జి రాము, కాపుశంబాం గ్రామానికి చెందిన కరణం అప్పలనాయుడు, పిల్ల నాగరాజు మృతిచెందారు. సీతంనాయుడు మృతితో భార్య, ఇద్దరు పిల్లలు అనాథలయ్యారు. అప్పలనాయుడు మృతితో భార్య, ఇద్దరు చిన్నారులు కన్నీటిసంద్రంలో మునిగిపోయారు. నాగరాజు మృతితో భార్య, బాబు, మజ్జి రాము మృతితో భార్య ఈశ్వరి, కిరణ్, నవ్యశ్రీ అనాథలుగా మారారు. బాధిత కుటుంబాలను మంత్రి విద్యాశాఖమంత్రి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు ఓదార్చారు. అండగా ఉంటామంటూ భరోసా ఇచ్చారు. మృతదేహాలను విజయనగరం సర్వజన ఆస్పత్రి నుంచి స్వగ్రామాలకు చేర్చే ఏర్పాట్లు చేశారు.



రైలు పట్టాల పునరుద్ధరణ పనుల్లో రైల్వే సిబ్బంది

దురదృష్టకరం

- డిప్యూటీ సీఎం రాజన్నదొర

సాలూరు: రైలు ప్రమాదం దురదృష్టకరమైన ఘటనగా డిప్యూటీ సీఎం పీడిక రాజన్నదొర అన్నారు. మృతుల కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతి తెలిపారు. విజయనగరం సర్వజన ఆస్పత్రికి వెళ్లి క్షతగాత్రులను పరామర్శించారు. రాష్ట్రానికి చెందిన మృతుల కుటుంబాలకు చెరో రూ.10 లక్షలు, క్షతగాత్రుల కుటుంబాలు, ఇతర రాష్ట్రాలకు చెందిన మృతుల కుటుంబాలకు చెరో రూ.రెండు లక్షలు, క్షతగాత్రుల కుటుంబాలకు చెరో రూ.50 వేల ఆర్థిక సహాయాన్ని ప్రభుత్వం ప్రకటించిందన్నారు. క్షతగాత్రులు కోలుకునేవరకు వైద్యసేవలు అందిస్తుందని తెలిపారు.

కోలుకునేవరకు బాధితులకు చికిత్స

- క్షతగాత్రులను పరామర్శించిన మంత్రి బొత్స



మాట్లాడుతున్న మంత్రి బొత్స సత్యనారాయణ

విజయనగరం అర్బన్: రైలు ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారికి రాష్ట్రప్రభుత్వం ఇప్పటికే ఎక్స్‌గ్రేషియాను ప్రకటించిందని, క్షతగాత్రులు కోలుకునేవరకు ఉచిత వైద్యసేవలు అందిస్తుందని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ తెలిపారు. జిల్లా సర్వజన ఆస్పత్రిలో క్షతగాత్రులను ఆయన పరామర్శించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ జిల్లా కేంద్రాస్పత్రిలో 29 మందికి వైద్య సేవలు అందుతున్నాయని, ఆరోగ్యం విషమంగా ఉన్న నలుగురుకు మెరుగైన వైద్యసేవలు అందజేయాలని వైద్యులకు సూచించామన్నారు. ఆరు మృతదేహాలకు పోస్టుమార్టం పూర్తిచేసి బంధువులకు వైద్యులు అప్పగించారన్నారు. ఆయన వెంట డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి, జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, కలెక్టర్ నాగలక్ష్మి, ఎస్పీ దీపికా పాటిల్, ఎమ్మెల్యే అలజంగి జోగారావు, ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు ఉన్నారు.

ప్రమాద స్థలాన్ని పరిశీలించిన ప్రజాప్రతినిధులు



ఘటనా స్థలాన్ని సందర్శిస్తున్న మంత్రి ముత్యాలనాయుడు, ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు

ఒడిశా రెవెన్యూ మంత్రి సుధామ్ మరిండి, ఏపీ డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు, ఎస్.కోట ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు ప్రమాదస్థలిని పరిశీలించారు. సహాయక చర్యలను సమీక్షించారు. ప్రమాదవార్త తెలిసిన వెంటనే ఎమ్మెల్యే శ్రీనివాసరావు ఘటనాస్థలికి చేరుకుని ఎల్.కోట, జామి మండలాల ప్రజాప్రతినిధులను, పార్టీ శ్రేణులను సహాయక చర్యలో నిమగ్నం చేశారు.

గిరిజన బాలికకు తీవ్రగాయాలు



గాయాలపాలైన యువతి బుజ్జి

సీతంపేట: మండలంలోని పెద్ద వంగరగూడ గ్రామానికి చెందిన సవర బుజ్జి రైలు ప్రమాదంలో గాయపడింది. విశాఖపట్నంలో నర్సింగ్ చదువుతున్న ఆమె తమ స్వగ్రామానికి విశాఖ-పలాస పాసింజర్‌లో వెళ్తుండగా ప్రమాదంలో చిక్కుకుంది.

ఏ దిక్కూలేక...



విషాదంలో మృతుడు భార్య, పిల్లలు



రైలు ప్రమాదంలో మృతిచెందిన కంచుబార్కి రవి(ఫైల్)

జామి: మండలంలోని గొడికొమ్ము గ్రామానికి చెందిన కంచుమార్కి రవి విద్యుత్ పనులు చేస్తూ భార్య కుమారి, ఇద్దరు కుమార్తెలు ప్రసన్న, హరితను పోషిస్తున్నారు. ఆదివారం ఉదయం పనికి వెళ్లే ముందు రూ.500 ఇచ్చి మటన్ తెచ్చి ఇంటికి ఇచ్చాడు. భర్త వస్తాడని ఎదురుచూసిన భార్య, నాన్న వస్తాడని ఎదురుచూసిన పిల్లలకు ఇకరాడని తెలియడంతో బోరున విలపిస్తున్నారు. ఇంటి పెద్దదిక్కును మృత్యువుకాటేయడంతో విషాదంలో మునిగిపోయారు.

ఆశలు తీరకుండానే అనంతలోకాలకు...



కృష్ణంనాయుడు (ఫైల్)

కొత్తవలస: కొత్తవలస మండలం దెందేరు గ్రామానికి చెందిన చింతల కృష్ణంనాయుడు (34) విజయనగరంలోని రైల్వే శాఖలో గ్యాంగ్‌మన్‌గా పని చేస్తున్నాడు. దెందేరు నుంచి బైక్‌పై కొత్తవలస రైల్వేస్టేషన్‌కు చేరుకొని అక్కడ నుంచి రాయగడ పాసింజర్‌లో రోజూ రాకపోకలు సాగిస్తుంటాడు. ఆదివారం ఆ రైలు ప్రమాదానికి గురికావడంతో ప్రాణాలు కోల్పో యాడు. పెళ్లైన ఏడాదికే మృతి చెందడంతో భార్య చంద్రకళతో పాటు నెలల చిన్నారి అనాథలుగా మారారు.

పెళ్లైన ఐదు నెలలకే...



రోధిస్తున్న సతీష్ తల్లి రాజ్యలక్ష్మి

విజయనగరం ఫోర్ట్: తోటపాలేంకు చెందిన చల్లా సతీష్ (29) విశాఖపట్నం సిరిపురంలోని ఓ జ్యూయలరీ దుకాణంలో పనిచేస్తున్నాడు. ప్రతిరోజూ విజయనగరం నుంచి వెళ్లి వస్తున్నాడు. ఆదివారం ఎప్పటి మాదిరి విశాఖపట్నంవెళ్లి రైల్లో తిరిగి వస్తుండగా అలమండ రైల్వేస్టేషన్ సమీపంలో జరిగిన రైలు ప్రమాదంలో మృతిచెందాడు. అతనికి ఐదు నెలల కిందట వివాహమైంది. కొడుకు మృతితో తల్లి రాజ్యలక్ష్మి రోధించిన తీరు కంటతడి పెట్టించింది.

వైభవంగా తొలేళ్ల ఉత్సవం



- ఘటాలు సమర్పించిన భక్తులు
- పైడితల్లికి పట్టువస్త్రాలు సమర్పించిన అశోక్ దంపతులు
- అమ్మవారిని దర్శించుకున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల దంపతులు,ప్రముఖులు
- అలరించిన వేషధారణలు, సాంస్కృతిక ప్రదర్శనలు
- భక్తులతో కోలాహలంగా మారిన చదురుగుడి, వనంగుడి
- నేడు సిరిమానోత్సవం



అమ్మవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తున్న పూసపాటి అశోక్ గజపతి దంపతులు



అమ్మవారిని దర్శించుకుంటున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల దంపతులు

విజయనగరం టౌన్: ఉత్తరాంధ్రుల ఆరాధ్య దైవం పైడితల్లి అమ్మవారి సిరిమానోత్సవానికి తొలేళ్ల ఉత్సవంతో శ్రీకారం చుట్టారు. సోమవారం వేకువజామునుంచే అమ్మవారికి ఆలయ అర్చకులు ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు జరిపారు. పూసపాటి వంశీయులైన అశోక్ గజపతిరాజు దంపతులు అమ్మవారికి పట్టువస్త్రాలు, సారెను కోట నుంచి సంప్రదాయరీతిలో పల్లకిలో తీసుకువచ్చి సమర్పించారు. ఆలయ అర్చకులు సంప్రదాయ బద్ధంగా వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు అనంతరం వేదాశీస్సులు అందజేశారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి సతీసమేతంగా పైడితల్లిని దర్శించుకున్నారు. అమ్మవారి సిరిమానోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తిచేశామన్నారు. అధికారులందరూ బాధ్యతాయుతంగా పనిచేస్తున్నారని, మూడురోజుల పండగ ప్రశాంతంగా జరగాలని తల్లిని ప్రార్థించామన్నారు. విశాఖ శ్రీ శారదా పీఠం స్వరూపానందేంద్ర సరస్వతి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం పూర్ణకుంభంతో ఆయనకు వేద పండితులు స్వాగతం పలికారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆయన మాట్లాడుతూ అమ్మవారి ఉత్సవాలంటేనే ఓ ప్రత్యేకత ఉంటుంది. ఏ రాష్ట్రంలోనూ జరగని విధంగా అమ్మవారి జాతరను ఏటా అత్యద్భుతంగా నిర్వహించడం సంతోషదాయకమన్నారు. అమ్మవారి కృప అందరిపైనా ఉండాలని ప్రార్థించామన్నారు.

ఘటాలతో నివేదన

అనాదిగా వస్తున్న ఆచారం ప్రకారం నగరంలోని పలువురు భక్తులు వివిధ వేషధారణలతో, డప్పుల మోతలతో ఆలయానికి చేరుకుని అమ్మవారిని దర్శించుకున్నారు. మొక్కుబడులు చెల్లించారు. ఘటాలను సమర్పించారు. తొలేళ్ల ఉత్సవం రోజున ఉదయం నుంచి రాత్రి వరకూ సుమారు 15 వేల మంది వరకూ దర్శించుకున్నట్టు అధికారులు చెబుతున్నారు.

ఉచిత సేవలు

అమ్మవారిని దర్శించుకునేందుకు వచ్చిన భక్తుల సౌకర్యార్థం పలు స్వచ్ఛంద సంస్థలు మంచినీరు, మజ్జిగను ఉచితంగా అందజేశాయి. మరికొందరు ఆహార పొట్లాలు పంపిణీ చేశారు. ఎస్పీ ఎం.దీపిక సారథ్యంలో పోలీస్ యంత్రాంగం పటిష్ట భద్రతా చర్యలు చేపట్టింది.

సంప్రదాయబద్ధంగా ఉత్సవం

అమ్మవారి చదురుగుడి నుంచి ఘటాలతో నడుచుకుంటూ పూజారి వెంకటరావుతో పాటు పలువురు పెద్దలు, దీక్షాపరులు కోటలో ఉన్న కోటశక్తికి సోమవారం పూజలు చేశారు. ఆరు ఘటాలు కోట వద్ద నుంచి తిరిగి చదురుగుడికి తీసుకెళ్లి అమ్మవారి చదురువద్ద పెట్టారు. అనంతరం రైతులకు విత్తనాలు అందజేసి, ఆశీర్వచనాలను అందజేశారు.

టీసీసీలో 64.40 శాతం ఉత్తీర్ణత

పార్వతీపురం: టెక్నికల్ సర్టిఫికెట్ కోర్సు ఫలితాల్లో 64.40 శాతం మంది ఉత్తీర్ణత సాధించినట్టు జిల్లా విద్యాశాఖాధికారి ఎస్.ప్రేమ్ కుమార్ తెలిపారు. ఈ ఏడాది జూలై నెలలో నిర్వహించిన డ్రాయింగ్, హ్యాండ్‌లూమ్ వీవింగ్, టైలరింగ్ అండ్ ఎంబ్రాయిడరీలో లోయర్, హయ్యర్‌గ్రేడ్, టెక్నికల్ కోర్సు పరీక్షల్లో 2,691 మంది అభ్యర్థులు పరీక్షలకు హాజరుకాగా 1733 మంది ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. అభ్యర్థులు డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.బీఎస్ఈ.ఏపీ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో మార్కుల మెమోరాండమ్‌ను డౌన్‌లోడ్ చేసుకోవాలన్నారు.

క్లుప్తంగా

నేడు జాబ్‌మేళా

పార్వతీపురం టౌన్‌: స్థానిక గాయత్రి డిగ్రీ కళాశాలలో మంగళవారం ఉదయం 9 గంటలకు జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల కరస్పాండెంట్ పీవీకె మణికుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబ్ మేళాలో డెక్కన్ ఫైన్ కెమికల్స్, నవత ట్రాన్స్ పోర్ట్, ముత్తూట్ ఫైన్స్, హీరో కార్పొరేషన్, పేటీఎం తదితర సంస్థల వారు ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. కావున పదవ తరగతి, ఐటీఐ, డిప్లమో, ఇంటర్మీడియట్, డిగ్రీ , ఎంబీఏ, ఎంసీఏ ఉత్తీర్ణులైన ఆసక్తిగల అభ్యర్థులు వారి సర్టిఫికెట్లతో హాజరుకావాలని కోరారు.

ఫార్మా కంపెనీలో ఉద్యోగాలకు 50మంది ఎంపిక



ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్న కంపెనీ ప్రతినిధులు

పార్వతీపురంటౌన్‌: పట్టణంలోని భాస్కర్ డిగ్రీ కళాశాలలో హెటిరో ఫార్మా కంపెనీ సోమవారం నిర్వహించిన జాబ్ మేళాలో 50మంది యువత ఉద్యోగాలు పొందినట్లు కళాశాల డైరెక్టర్ బి.శ్రీనివాసరావు తెలిపారు. జాబ్‌మేళాకు 150మంది నిరుద్యోగులు హాజరైనట్లు చెప్పారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఎం.రవిశాస్త్రి, కోఆర్డినేటర్ ఎన్.సురేష్, సిబ్బంది తదితరులున్నారు. ఈ సందర్భంగా నూతనంగా ఎంపికైన యువతను సిబ్బంది అభినందించారు.

3,400 లీటర్ల సారా ధ్వంసం



సారాను ధ్వంసం చేయిస్తున్న ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ ఉపేంద్ర

పార్వతీపురంటౌన్‌: గడిచిన రెండు నెలల నుంచి 62 కేసుల్లో సీజ్ చేసిన 3,400 లీటర్ల సారాను ధ్వంసం చేసినట్లు ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ ఎల్.ఉపేంద్ర తెలిపారు. ఈ మేరకు సోమవారం పార్వతీపురం పరిధిలోని నవిరి కాలనీ సమీపంలో గల పాత తోటపల్లి రహదారి పరిధిలో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ బి.ఈశ్వరరావు ఆధ్వర్యంలో సారాను ధ్వంసం చేసినట్లు చెప్పారు. అక్రమంగా మద్యం తయారు చేసినా, విక్రయించినా తీసుకునే చర్యలు కఠినంగా ఉంటాయని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

విషాహారంతో ఐదుగురికి అస్వస్థత

వీరఘట్టం: మండలంలోని తూడి గ్రామంలో విషారం తినడం వల్ల ఓ కుటుంబం తీవ్ర అస్వస్థతకు గురైంది. మురగడాపు లక్ష్మణ్‌దొర, గౌరమ్మ, చంద్రశేఖర్, శ్యామ్‌సుందర్, రూపలు ఆదివారం ఇంటిలో టిఫిన్ చేస్తుండగా చట్నీలో బల్లి పడింది. ఈ విషయం గమనించకుండా వారంతా టిఫిన్ తినేశారు. దీంతో కుటుంబసభ్యులంతా ఒక్కసారిగా వాంతులు చేసుకోవడం ప్రారంభించార. ఈ విషయం గమనించిన స్థానికులు బాధిత కుటుంబసభ్యులను పాలకొండ ఏరియా ఆస్పత్రికి తరలించారు. కుటుంబసభ్యుల్లో నలుగురి ఆరోగ్య పరిస్థితి కుదుటపడడంతో ఇంటికి పంపించేశారు. చంద్రశేఖర్ పరిస్థితి అదుపులోకి రాకపోవడంతో బంధువులు ప్రైవేట్ ఆస్పత్రిలో చేర్పించారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

భోగాపురం: మండలంలోని తోటపల్లి మద్యం షాపు వద్ద ఈనెల 17న ఇరువర్గాల మధ్య జరిగిన వివాదంలో విశాఖపట్నంలోని జాలారిపేటకు మరుపల్లి చినరాము(20)పై తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో క్షతగాత్రుడిని విశాఖలోని కేజీహెచ్‌కు తరలించగా చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందినట్లు ఎస్సై కృష్ణమూర్తి తెలిపారు.

సక్రమంగా విధులు నిర్వర్తించాలి

బాడంగి: విధులు సక్రమంగా నిర్వర్తించాలని జెడ్పీటీసీ పెద్దింటి రామారావు ఎనర్జీ అసిస్టెంట్లకు సూచించారు. సోమవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఎనర్జీ అసిస్టెంట్లతో సమావేశమైన ఆయన ఇటీవల జరిగిన మండల సర్వసభ్య సమావేశంలో మండలంలోని ఎనర్జీ అసిస్టెంట్లు సరిగా పనిచేయడం లేదని, వీధి లైట్లు పోయినా బాగు చేయడం లేదని తలెత్తిన ఆరోపణలపై జెడ్పీటీసీ ఎనర్జీ అసిస్టెంట్లను నిలదీశారు. వారు మాట్లాడుతూ ఐదు పంచాయతీల్లో ఎనర్జీ అసిస్టెంట్లు లేరని, తమకు కూడా సహాయకులను ఇవ్వాలని కోరారు. అలాగే క్లాప్‌మిత్రలకు చెల్లించాల్సిన బకాయి వేతనాలను తక్షణమే చెల్లించే చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులకు జెడ్పీటీసీ సూచించారు. నవంబరు 15వ తేదీ లోగా వారికి బకాయి పడిన మొత్తాన్ని చెల్లించాలన్నారు.

సిరిమానోత్సవానికి సర్వం సిద్ధం

- నేటి మధ్యాహ్నం 3.15 గంటలకు సిరిమాను తిరువీధి ఆరంభం
- హుకుంపేట నుంచి 12 గంటలకే సిరిమాను తరలింపు
- ఉత్సవానికి 50 అడుగుల సిరిమాను సిద్ధం
- సిరిమానును ఏడోసారి అధిరోహించనున్న పూజారి వెంకటరావు



పైడితల్లి అమ్మవారు

విజయనగరం టౌన్‌: భక్త కోటికి ముక్తిదాయకం సిరిమాను వీక్షణం. ఆ చల్లని తల్లి కరుణా కటాక్షాల కోసం లక్షలాది మంది భక్తులు సిరిమానును దర్శించుకునేందుకు తరలివస్తారు. సిరిమానుపై పూజారి రూపంలో వచ్చిన పైడితల్లిని కనులారా వీక్షించాలని పరితపిస్తారు. ఈ బృహత్తర ఘట్టం మరికొద్ది గంటల్లో ప్రారంభంకానుంది. ఆ సిరి సంబరాన్ని తిలకించేందుకు లక్షలాది మంది భక్తజనం ఇప్పటికే విజయనగరం చేరుకుంది. మంగళవారం మధ్యాహ్నం 3.15 గంటలకు ప్రారంభమయ్యే సిరిమానోత్సవంలో ప్రధాన పూజారి బంటుపల్లి వెంకటరావు ఈ ఏడాది ఏడోసారి సిరిమానును అధిరోహించనున్నారు. సుమారు నాలుగున్నర లక్షలమంది భక్తులు తరలివస్తారని అంచనా. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారయంత్రాంగం పటిష్ట ఏర్పాట్లు చేసింది.

అన్నీ రసవత్తర ఘట్టాలే..

భక్తులను విశేషంగా ఆకట్టుకునే సిరిమానోత్సవంలో అన్నీ రసవత్తర ఘట్టాలే. 50 అడుగుల పొడవున్న సిరిమాను ఉపరితలంలో బిగించే ఇరుసుపై ఏర్పాటుచేసిన పీటపై ప్రధాన పూజారి విసనకర్ర చేతపట్టి ఆశీనులవుతారు. రెండో చివరన రథంపై అమర్చిన ఇరుసును మానుకు అమర్చుతారు. దాని ఆధారంగానే మాను పైకిలేస్తుంది. గజపతిరాజ వంశీయుల్లో ఒకరు తాడు లాగడంతో సిరిమాను ఊరేగింపు మూడులాంతర్లు వద్దన ఉన్న పైడితల్లి అమ్మవారి ఆలయం నుంచి మొదలై రాజా బజారు మీదుగా కోట వరకూ మూడుసార్లు తిరుగుతుంది. ఊరేగింపు ఆద్యంతం విసనకర్ర విసురుతూ కనిపించే సిరిమాను పూజారిని భక్తులు అరటిపండ్లతో కొలుస్తారు.

కోటవరకూ మూడుసార్లు

అత్యంత నియమనిష్టలతో ఉపవాసం ఉండే సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు హుకుంపేటలో మధ్యాహ్నం 12 గంటలకు కాలిన డకన వీధుల్లోంచి బయలుదేరి వేలాది మంది భక్తుల సందడితో ఊరేగింపుగా వస్తారు. దారిపొడవునా ప్రజలు పూజారి పాదాలపై పసుపునీటిని పోసి దీవెనలు అందుకుంటారు. అనంతరం నిర్ణయించిన ముహూర్తానికి సిరిమానును అధిరోహిస్తారు. సిరిమానుతో సంబరం ప్రారంభానికి ముందు పాలధార, ఆలయానికి రావడం ఆనాదిగా వస్తున్న ఆచారం. జాలరివలను వెన్నంటే ఈటెలు చేతపట్టి వచ్చే జనం మహాశక్తి స్వరూపాలుగా భావిస్తారు. పాలధారగా పిలిచే జనధార అమ్మవారి సైనిక శక్తికి వారసులంటారు. తొలుత కొందరు ఈటెలను ధరించి అమ్మవారి ఆలయానికి వస్తారు. అక్కడ పైడిమాంబను దర్శించుకున్న అనంతరం డప్పు, వాయిద్యాలతో కోట వద్దకు చేరుకుంటారు. ఇక్కడ పూజలు చేసిన అనంతరం కోటకు పశ్చిమ భాగంవైపు వెళ్లి, కోటశక్తికి నమస్కరిస్తారు. సైనికులుగా పనిచేసే వీరంతా ప్రజలు ఆరోగ్యంగా ఉండాలన్న భావంతో గ్రామ కట్టడి చేస్తారు. ఈ ఘట్టంలో సాకేటివీధికి చెందిన వారు పాల్గొంటారు. ఇక జాలరివలతో యాతవీధికి చెందిన జాలర్లు పాల్గొంటారు. ఇక జాతరలో సిరిమానుకు అంజలి ఘటిస్తూ ముందుకు సాగే అంజలి రథం ఉంటుంది. అంజలి రథంపై నడిపేన, కోరాడ కుటుంబాల వారు ముందుకు సాగుతారు. నాటుబండిపై డోలును బిగించి, దానికి అటు, ఇటు రాటలను కడతారు. దానిపై ఐదుగురు పురుషులు మహిళల వేషధారణలో కూర్చొంటారు. వీరంతా ఆరుమూరల నార చీరను చేతికి వెండి సందెలను ధరిస్తారు. వీరంతా అమ్మవారి పరిచారకులుగా వ్యవహరిస్తారు. చివరిగా సంబరంలో తెల్ల ఏనుగుకు విశిష్ట స్థానం ఉంది. పూసపాటి గజపతులు ముస్తాబు చేసిన అంబారీ ఏనుగుపై కూర్చొని సంబరంలో పాల్గొనేవారు. సిరిమానుకు ముందు పట్టపుటేనుగు నడిచేది. దానికి ప్రతిరూపమే ఈ వాహనం. ఈ ఏనుగుపై ఒక పురుషుడు, స్త్రీ వేషంలో ఉండే మరో ఏడుగురు పురుషులు కూర్చొంటారు. వీరంతా పైడితల్లమ్మకు అక్కాచెల్లెళ్లు అయిన గ్రామదేవతలుగా, మగవేషంలో ఉన్న వ్యక్తి అమ్మవారి సోదరుడు పోతురాజుగా భావిస్తారు.

పటిష్ట బందోబస్తు

అత్యంత ఘనంగా నిర్వహిస్తున్న సిరిమానోత్సవానికి పోలీస్‌శాఖ పటిష్ట బందోబస్తు అందిస్తోంది. ఇద్దరు అదనపు ఎస్పీలు, 12 మంది డీఎస్పీలు, 58 మంది సీఐ/ఆర్ఐలు, 144 మంది ఎస్ఐలు/ఆర్ఎస్ఐలు, 19 మంది మహిళా ఎస్ఐలు, ఇతర పోలీస్ అధికారులు, స్పెషల్ పార్టీ సిబ్బందితో సహా 2015 మంది పోలీస్ అధికారులను, సిబ్బందిని బందోబస్తు నిమిత్తం వినియోగిస్తున్నామని ఎస్పీ ఎం.దీపిక స్పష్టం చేశారు.

ప్రజా సమస్యలకు తక్షణ పరిష్కారం

- కలెక్టర్ నిషాంత్‌కుమార్



వినతులను స్వీకరిస్తున్న కలెక్టర్ నిషాంత్‌కుమార్

పార్వతీపురం: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజలు తెలియజేసిన సమస్యల పరిష్కారానికి అధికారులు తక్షణ చర్యలు తీసుకోవాలని పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టర్ నిషాంత్ కుమార్ ఆదేశించారు. ఈ మేరకు సోమవారం ఆయన కలెక్టరేట్‌లోని సమావేశమందిరంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఆర్ గోవిందరావు, ఐటీడీఏ ప్రాజెక్టు అధికారి సి.విష్ణుచరణ్, జిల్లారెవెన్యూ అధికారి జె.వెంకటరావుతో కలిసి ప్రజలనుంచి వినతులు స్వీకరించారు. జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ప్రజలు తెలియజేసిన సమస్యల గురించి సంబంధిత జిల్లా, మండల అధికారులతో నేరుగా మాట్లాడి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని ఆదేశాలు జారీచేశారు. అర్జీలపై సకాలంలో స్పందించి, చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సందర్భంగా పాలకొండ మండలం కోమటిపేటకు చెందిన చల్లా నాగభూషణరావుకు జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు వినికిడియంత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో ప్రజలు పలు సామాజిక, వ్యక్తిగత అంశాలపై 156 అర్జీలు అందజేశారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి బి.జగన్నాథరావు, జిల్లా నీటి యాజమాన్య సంస్థ ప్రాజెక్ట్ డైరెక్టర్ కె. రామచంద్రరావు, జిల్లా ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజినీరింగ్ అధికారి ఒ. ప్రభాకర రావు, జిల్లా గ్రామ పంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ, జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్. ప్రేమ్‌కుమార్, జిల్లా ఉద్యాన అధికారి కేవీఎస్ఎన్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి కె. రాబర్ట్ పాల్, జిల్లా ప్రణాళిక అధికారి పి. వీర రాజు, పౌర సరఫరాల సంస్థ జిల్లా మేనేజర్ ఎం.డి.నాయక్, జిల్లా పౌర సరఫరాల అధికారి సూర్యారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గర్భిణుల ఆరోగ్యం పట్ల అప్రమత్తం

- డీఐఓ టి.జగన్మోహనరావు



వైద్యాధికారులతో మాట్లాడుతున్న డీఐఓ డాక్టర్ టి.జగన్మోహనరావు

సీతానగరం: గర్భిణులు, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వైద్యాధికారులు, సిబ్బంది ఆరోగ్య కార్యక్రమాలపై పక్కాప్రణాళికతో కృషిచేయాలని జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి (డీఐఓ) డాక్టర్ టి.జగన్మోహనరావు అన్నారు. ఈ మేరకు సోమవారం ఆయన స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఆస్పత్రికి వివిధ రకాల ఆరోగ్య సమస్యలతో వచ్చినవారికి తనిఖీలు జరుగుతున్న తీరును పరిశీలించారు. వార్డులో అందజేస్తున్న చికిత్సను పరిశీలించి రోగులతో మాట్లాడి సలహాలు ఇచ్చారు. అనంతరం వైద్యాధికారులు, సూపర్‌వైజర్స్‌తో నిర్వహించిన సమావేశంలో డాక్టర్ జగన్మోహనరావు పాల్గొని ఆరోగ్య కార్యక్రమాలపై సమీక్షించారు. మాతా, శిశు ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధతీసుకోవాలని గర్భిణులు, శిశువుల ఆరోగ్య విషయంలో ఏ చిన్న సమస్య వచ్చినా సిబ్బంది అప్రమత్తంగాఉండాలని ఆదేశించారు. సచివాలయాల పరిధిలో రక్తహీనత, బరువు తక్కువగా ఉన్న శిశువులు, గర్భిణులను గుర్తించి, అంగన్వాడీ సిబ్బంది సమన్వయంతో సత్వరమే నివారణ చర్యలు చేపట్టాలని సూచించారు. వసతి గృహ విద్యార్థుల ఆరోగ్యాన్ని పర్యవేక్షించాలని, అలాగే రక్తహీనత గుర్తించిన కిశోరీ బాలికలకు హిమోగ్లోబిన్ శాతం వృద్ధిచెందేలా చర్యలు చేపట్టాలని కోరారు. జగనన్న ఆరోగ్య సురక్షలో వివిధ ఆరోగ్య సమస్యలతో కొత్తగా గుర్తించిన దీర్ఘ కాలిక ఆరోగ్య సమస్యలు, టీబీ, లెప్రసీ, రక్తహీనత, దృష్టి సమస్యలపై ఉన్నతాస్పత్రికి రిఫర్ చేసినవారిని, ఆరోగ్యశ్రీ అర్హులను పర్యవేక్షించాలని స్పష్టం చేశారు. అదేవిధంగా పీహెచ్‌సీ, వెల్‌నెస్ కేంద్రాల్లో అత్యవర చికిత్సకు అవసరమయ్యే మందులు అందుబాటులో ఉండేలాచూడాలని చెప్పారు. కార్యక్రమంలో వైద్యాధికారులు కె.శిరీష, ఉషారాణి, సూపర్‌వైజర్స్ కె.సత్యవతి, జయగౌడ్, ఏఎన్ఎంలు, వైద్యసిబ్బంది ఉన్నారు.

గొట్లాంను దత్తత తీసుకున్న మెడికల్ విద్యార్థులు



సమావేశంలో మాట్లాడుతున్న విజయనగరం మెడికల్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీనివాసరావు

బొండపల్లి: మండలంలోని గొట్లాం గ్రామంతో పాటు పంచాయతీ పరిధిలోని రెడ్డిపేట, బారికపాలెం, జియ్యన్నవలస గ్రామాలను విజయనగరంలోని గాజులరేగ వద్ద గల ప్రభుత్వ మెడికల్ యూనివర్సిటీ విద్యార్థులు దత్తత తీసుకున్నారు. 2023 సంవత్సరం నుంచి 5 సంవత్సరాల పాటు ఆ గ్రామాలను దత్తత తీసుకున్నట్లు మెడికల్ యూనివర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఈ మేరకు గొట్లాంలోని గ్రామ సచివాలయంలో సోమవారం గ్రామానికి చెందిన నాయకులతో పాటు, వలంటీర్లతో సమావేశం నిర్వహించారు. యూనివర్సిటీలో ఈఏడాది కొత్తగా మెడికల్ సీట్లు పొంది విద్యను అభ్యసిస్తున్న 150 మంది విద్యార్థులు ఒక్కొక్కరూ 5 కుటుంబాలు చొప్పున 750 కుటుంబాలును దత్తత తీసుకుని కుటుంబాల్లోని వారి ఆరోగ్య పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తారని తెలిపారు. 5 సంవత్సరాల పాటు విద్యార్థులు గ్రామంలో ప్రతి ఒక్కరి ఆరోగ్యంపై ప్రత్యేకంగా శ్రద్ధ తీసుకోవడంతో పాటు ప్రతి నెలా రెండవ శనివారం హెల్త్ క్యాంప్ నిర్వహిస్తారని చెప్పారు. ఈ కార్యక్రమాన్ని వచ్చే నెల 11న గ్రామంలో లాంఛనంగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో గొట్లాం పీఏసీఎస్ త్రిసభ్య కమిటీ చైర్మన్ మహంతి రమణ, బొండపల్లి పీహెచ్‌సీ సీహెచ్ఓ రాజ్‌గోపాల్, ఎస్.ఎ.బాషా, పంచాయతీ కార్యదర్శి నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి పోటీల్లో సిరిపురం విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

సంతకవిటి: మండల పరిధిలోని సిరిపురం జిల్లా పరిషత్ పాఠశాల విద్యార్థులు శ్రీకాకుళంలోని ఆర్ట్స్ కళాశాల మైదానంలో ఆదివారం జరిగిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ పోటీలలో ప్రతిభ కనబరిచారు. ఈ మేరకు హెచ్ఎం వి.వెంకటరావు సోమవారం తెలిపారు. బి.సోనియా 100మీటర్లు, 800 మీటర్ల రన్నింగ్‌లో ద్వితీయస్థానం, డి.జ్యోత్స్న 600మీటర్ల రన్నింగ్‌లో ద్వితీయ స్థానం, సీహెచ్ యశ్వంత్, ఆర్.స్వాతిలు లాంగ్‌జంప్‌లో ప్రథమ స్థానం, బి.వెంకటలక్ష్మి జావెలిన్‌త్రోలో ప్రథమ స్థానం, ఎ.డిల్లీశ్వరరావు హై జంప్‌లో ద్వితీయ స్థానం, మణిచంద్ 2కె రన్‌లో ద్వితీయ స్థానంలో నిలిచారని హెచ్ఎం చెప్పారు. ఈ ప్రతిభను చూపిన విద్యార్థులందరితో పాటు, పీడీలను సోమవారం పాఠశాలలో హెచ్ఎం, ఉపాధ్యాయ సిబ్బంది అభినందించారు.

జిల్లాస్థాయి బాల్‌బ్యాడ్మింటన్ పోటీలు ప్రారంభం



బాల్ బ్యాడ్మింటన్ పోటీలను ప్రారంభిస్తున్న జెడ్పీటీసీ గారతవుడు, తదితరులు



పోటీల్లో తలపడుతున్న క్రీడాకారిణులు

గజపతినగరం: గజపతినగరంలోని బాలికోన్నత పాఠశాల ప్రాంగణంలో స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో సోమవారం జిల్లాస్థాయి (బాలురు, బాలికల) అండర్-14,అండర్ 17 బాల్ బ్యాడ్మింటన్ క్రీడా పోటీలు ప్రారంభమయ్యాయి. ఈ పోటీలను ప్రారంభించిన జెడ్పీటీసీ గార తవుడు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఈ పోటీల్లో ఉత్తమ ప్రదర్శన కనబరిచి జిల్లా, రాష్ట్రస్థాయి జట్లలో స్థానం సంపాదించాలని ఆకాంక్షించారు.

క్రీడా పరికరాలు అందజేత

ఈ సందర్భంగా ప్రభుత్వ బాలికోన్నత పాఠశాలకు మంజూరైన క్రీడా సామగ్రి, వంట సామగ్రిని ప్రధానోపాధ్యాయుడు రమేష్‌కుమార్‌కు ఆయన అందజేశారు. కార్యక్రమంలో ఎస్‌జీఎఫ్ సెక్రటరీ ఎల్‌వీ రమణ,బాడ్మింటన్ అసోసియేషన్ జిల్లా సెక్రటరీ తోనంగి శ్రీనివాసరావు, నియోజకవర్గం క్రీడల ఇన్‌చార్జ్ సీహెచ్ సత్యనారాయణలతో పాటు మండల విద్యాశాఖ అధికారులు ఎస్.విమలమ్మ, సాయిచక్రధర్, ప్రధానోపాధ్యాయుడు చిప్పాడ రమేష్ కుమార్, స్థానిక వైఎస్సార్‌సీపీ సీనియర్ నేతలు మండల సురేష్, రేగసురేష్, గజపతినగరం మాజీ సర్పంచ్ కందుల చిన్నయ్య స్వామి, ఎస్ఎమ్‌సీ చైర్మన్ సోమావతి, జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం అధ్యక్షుడు వెంకటనాయుడు, వ్యాయామ ఉపాధ్యాయులు దారరాజు, గెద్ద గురునాయుడు, టి.శ్రీనివాసరావు,లక్ష్మణరావులు పాల్గొన్నారు.

నవంబర్ 10లోగా పదోతరగతి ఫీజులు చెల్లించాలి

పార్వతీపురం:

పదోతరగతి రెగ్యులర్, ప్రైవేట్ విద్యార్థులు పరీక్ష ఫీజులను నవంబర్ 10లోగా చెల్లించాలని పార్వతీపురం మన్యం జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ్ కుమార్ ప్రధానోపాధ్యాయులను ఆదేశించారు. రూ.50లు అపరాధ రుసుముతో 16వ తేదీ వరకు, 200 అపరాధ రుసుంతో 22వ తేదీ వరకు, రూ.500 అపరాధ రుసుముతో నవంబర్ 30వరకు చెల్లించవచ్చన్నారు. ఎస్సీ,ఎస్టీ, బీసీ వర్గాలకు చెందిన రెగ్యులర్ విద్యార్థులకు సంబంధించి పట్టణంలో రూ.24వేలు, గ్రామీణ ప్రాంతంలో రూ.20వేల లోపు ఆదాయం గల వారికి ఫీజులో మినహాయింపు ఉంటుందన్నారు.

ఉత్సాహంగా క్రీడా సంబరం



సంగిడీ రాళ్ల పోటీల్లో బరువు ఎత్తుతున్న వస్తాదులు

విజయనగరం: విజయనగరం ఉత్సవాలు, పైడితల్లమ్మవారి జాతర మహోత్సవాల్లో భాగంగా నిర్వహిస్తున్న క్రీడా సంబరాలు సోమవారం ఉత్సాహభరిత వాతావరణంలో సాగాయి. సెట్విజ్ ఆధ్వర్యంలో నగరంలోని రాజీవ్‌క్రీడామైదానం ప్రాంగణంలో కరాటే, కుస్తీ, ఫెన్సింగ్, వెయిట్‌లిఫ్టింగ్, బెలూన్స్ ఫెస్టివల్, పతంగుల ఎగురవేత పోటీలు నిర్వహించారు. అలాగే ఆదివారం ప్రారంభమైన ఉత్తరాంధ్ర స్థాయి వాలీబాల్, కబడ్డీ పోటీలు రెండవ రోజు ఉత్కంఠ భరితంగా సాగాయి. పోటీల్లో వందల సంఖ్యలో క్రీడాకారులు పాల్గొని ప్రతిభాపాటవాలను కనబరిచారు. పోటీల్లో విజేతలకు ప్రముఖుల చేతుల మీదుగా బహుమతులు ప్రదానం చేశారు.



కుస్తీ పోటీల్లో తలపడుతున్న క్రీడాకారులు

అథ్లెటిక్స్‌లో జీఎంఆర్ ఐటీ విద్యార్థుల ప్రతిభ



ప్రతిభకనబరిచిన విద్యార్థులతో జీఎంఆర్ ఐటీ ఎడ్యుకేషన్ డైరెక్టర్ తదితరులు

రాజాం సిటీ: స్థానిక జీఎంఆర్ ఐటీ విద్యార్థులు శ్రీకాకుళంలో నిర్వహించిన కొన్న చిన్నారావు మెమోరియల్ అథ్లెటిక్స్ చాంపియన్ షిప్ పోటీల్లో ప్రతిభ కనబరిచారని పీడీ బీహెచ్ అరుణ్‌కుమార్ సోమవారం తెలిపారు. అండర్ 20, 18 బాలబాలికల విభాగాలకు సంబంధించి నిర్వహించిన వివిధ పోటీల్లో బంగారు, వెండి పతకాలు సాధించారన్నారు. అండర్ 20 బాలబాలికల విభాగం ఎం.ప్రవల్లిక (షాట్‌పుట్, లాంగ్ జంప్), వి. దదిరి (100 మీటర్ల పరుగు), టి.జశ్వంత్ (షాట్‌పుట్), వి.జోసెఫ్‌రాజు (హైజంప్), కె.అనంత్‌కుమార్ (800 మీటర్ల పరుగు)లు బంగారు పతకాలు సాధించారని తెలిపారు. అలాగే లాంగ్‌జంప్‌లో వి.దదిరి, వి.జోసెఫ్‌రాజు, షాట్‌పుట్‌లో టి.ఉమామహేశ్వరి, జావెలిన్‌త్రోలో డి.పవన్‌కుమార్, హైజంప్‌లో ఎం.రవిరాజు అభిలు సిల్వర్ పతకాలు సాధించారన్నారు. అండర్ 18 విభాగంలో జి.దివ్య, జి.ఢిల్లీశ్వరి, పి.తేజకుమారి, జి.శిరీష, ఎం.విజయ, ఆర్.లోకేష్, ఎ.ఉదయ్‌కిరణ్‌లు సిల్వర్, రజత పతకాలు సాధించారని వివరించారు. ప్రతిభ కనబర్చిన విద్యార్థులను జీఎంఆర్ ఐటీ ఎడ్యుకేషన్ డైరెక్టర్ డాక్టర్ జె.గిరీష్, డీన్‌లు డాక్టర్ ఎం.వి. నాగేశ్వరరావు, డాక్టర్ వి.రాంబాబు తదితరులు అభినందించారు.

తైక్వాండో పోటీల్లో బంగారు పతకాలు



సాయికిరణ్



టి.సంతోష్



జయవర్ధన్

బొబ్బిలి: మండలంలోని కోమటిపల్లి జ్యోతిబాపూలే గురుకుల పాఠశాల 9వ తరగతి విద్యార్థి తుమరాడ సాయికిరణ్, 7వ తరగతి చదువుతున్న కునుకు జయవర్ధన్‌లు ఈనెల 29 నుంచి సోమవారం వరకూ సత్యసాయి జిల్లా చిగిచెర్ల జెడ్పీ ఉన్నత పాఠశాలలో జరిగిన ఏపీ 67వ ఎస్‌జీఎఫ్ రాష్ట్ర స్థాయి తైక్వాండో పోటీల్లో ప్రతిభ కనబర్చారు. వారితో పాటు రామభద్రపురం మండలం ఆరికతోట జెడ్పీ ఉన్నత పాఠశాలలో చదువుతున్న టి.సంతోష్ కూడా ప్రతిభ కనబర్చాడు. తుమరాడ సాయికిరణ్ 50 కిలోల పోటీల్లో బంగారు పతకం, సంతోష్ 40 కిలోల పోటీల్లో బంగారు పతకం సాధించి వచ్చే నెలలో జమ్ముకశ్మీర్‌లో జరిగే జాతీయ పోటీల్లో పాల్గొనేందుకు అర్హత సాధించినట్టు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ గుణుపూరు పురుషోది తెలిపారు. కాగా కునుకు జయవర్ధన్ మూడవ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. వారిని ఉపాధ్యాయులు, తైక్వాండో సంఘం కార్యవర్గం అభినందించారు.

చికెన్	
బ్రాయిలర్	
లైవ్	₹ 120
డ్రెస్డ్	₹ 210
స్కిన్ లెస్	₹ 220

ఇంటర్మీడియట్ విద్యార్థిని ఆత్మహత్య



హాస్టల్‌లో అమృత మృతదేహం

భామిని: మండలంలోని దిమ్మిడిజోలకు చెందిన ఇంటర్‌మీడియట్ విద్యార్థిని కనపల అమృత(17) పాతపట్నంలోని పోస్టు మెట్రిక్ హాస్టల్‌లో సోమవారం ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. దసరా సెలవులకు ఇంటికి వచ్చిన అమృతను తల్లి ఇందిర సోమవారం ఉదయం హాస్టల్‌లో దిగబెట్టి తిరిగి ఇంటికి చేరే సమయానికి కూతురి మరణవార్త అందింది. ఈ వార్త విన్న కుటుంసభ్యుల రోదన వర్ణనాతీతంగా ఉంది. ఇందిర ఆత్మహత్యకు పాల్పడినట్లు సమాచారం రావడంతో బంధువులతో కలిసి విలపిస్తూ కుటుంబసభ్యులంతా పాతపట్నం వెళ్లి కంటికీమింటికీ ఏకధారగా విలపించారు. అయితే ఆత్మహత్యకు గల కారణాలు తెలియరాలేదు. ఈ ఘటనపై పాతపట్నం పోలీసులు కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం తరలించారు. అమృత పదో తరగతి వరకు భామిని కేజీబీవీలోనే చదువుకుంది. మృతురాలికి తండ్రి మిన్నారావు, ఇద్దరు తమ్ముళ్లు ఉన్నారు.

భవనం పైనుంచి జారిపడి వ్యక్తి మృతి



మృతి చెందిన మంగన్న

రాజాం సిటీ: భవనంపై నుంచి జారిపడి జడ్డు మంగన్న(45) అనే వ్యక్తి మృతి చెందాడు. ఈ విషాద ఘటన రాజాంలో సోమవారం జరిగింది. వివరాలిలా ఉన్నాయి.. మండల పరిధిలోని పొగిరి గ్రామానికి చెంది మంగన్న మిల్లర్ మేస్త్రీగా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. రాజాం పట్టణంలోని వాసవీనగర్‌లో జరుగుతున్న ఓ భవన నిర్మాణం రెండో అంతస్తు పైనుంచి ప్రమాదవశాత్తు జారిపడి కిందపడ్డాడు. దీంతో తీవ్రగాయాలపాలై అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయాడు. మృతదేహాన్ని రాజాం ప్రాంతీయ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. ఈ ఘటనకు సంబంధించి, ఇంతవరకు సమాచారం లేదని, ఫిర్యాదు అందితే కేసు నమోదు చేస్తామని ఎస్ఐ వి.బి.రామకృష్ణ తెలిపారు.